# సంస్కారం



ఆయన మళ్లీ ఆ కిటికీ దగ్గరికి వెళ్లి నిలబడ్డారు.

బాధతో నిట్టూర్చాను.

గత రెండు మాసాలుగా రాత్రిపూట భోజనం చేశాక ఆయన దినచర్య యిది!

ఓ పది నిమిషాలు అలాగే నిలబడి ఎదురింటి మేడ కిటికీలోంచి కనిపిస్తున్న ఓ అమ్మాయిని చూడటం ఆయనకు కొత్తగా వచ్చిన అలవాటు. కాదు... దురలవాటు. తమ పెళ్ళయ్యాక ఆయన ఎన్నోసార్లు రోడ్డుపై ఎవరైనా అందమైన అమ్మాయి కనిపిస్తే "శైలూ... ఆ అమ్మాయి చాలా బాగుంది కదూ?!" అనడం కద్దు. అయితే ఆయన మాటల్లో గాని, చేష్టల్లో కాని లేకితనం కనిపించేది కాదు. నా భర్త 'సంస్కారి' అని గర్వపడేదాన్ని. కాని, ఈ రెండు నెలల్లో ఆయన ప్రవర్తన నా అభిప్రాయాన్ని మార్చివేసింది.

అసలు ఈమధ్య ఆయనతో మాట్లాడటానికి వీలుకావడం లేదు. మామూలు టైము కంటే ముందే ఆఫీసుకి బయలుదేరుతున్నాడు. రాత్రి ఇల్లు చేరేసరికి పన్నెండవుతుంది. ఆలస్యమయ్యిందేమని అడిగితే 'ఓవర్ టైమ్' చేయాల్సివచ్చిందని చెపుతారు. ఓవర్‌టైమ్ ఆఫీసులో పని వల్లనా? ఆ అమ్మాయితో తిరగడం వల్లనా?... నాకర్థం కాదు.

"శైలూ! ఇలా రా!" ఆయన పిలిచారు.

కొంపదీసి ఆ అమ్మాయిని తాను ప్రేమిస్తున్నానని, పెండ్లి చేసుకోవడానికి అనుమతి ఇవ్వమని అడగరు కదా?!

గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఆయన దగ్గరగా వెళ్లి నిలబడ్డాను.

ఇప్పుడు ఆ అమ్మాయి బాగా కనబడుతోంది. చాలా అందంగా ఉంది. కానీ, మరీ చిన్న అమ్మాయిలా అన్పిస్తుంది. అయితే పొద్దస్తమానం ఆ కిటికీ దగ్గరే కూర్చుని చదువుకోవడం నాకు నచ్చలేదు.

"శైలూ! ఆ అమ్మాయి ఎవరో తెలుసా?"

'మీ గర్ల్‌ఫ్రెండ్!' మనసులోనే కసిగా అనుకున్నాను. పైకి మాత్రం తెలీదన్నట్లు తల అడ్డంగా ఊపాను.

ఆయన చెప్పడం ప్రారంభించారు.

"ఆ అమ్మాయి నా ఫ్రెండ్ శివం పెదనాన్న కూతురు. ఏడాది క్రితం ఏక్సిడెంట్‌లో ఓ కాలు పోయింది. తనకు జైపూర్ కాలు చేయించమని తండ్రిని కోరింది. కానీ, శివం పెదనాన్న రిటైర్డ్ టీచరు. ఉన్న డబ్బుని పెద్దకూతురి పెళ్ళికి ఖర్చు చేసేశారు. నాకు ఆ అమ్మాయికి ఎలాగైనా జైపూర్ కాలు చేయించి బయటి ప్రపంచం చూసేలా చేయాలని పించింది. కానీ, మనదీ మధ్యతరగతి బ్రతుకులే. బ్యాంక్‌లో నా సేవింగ్స్‌కు మరికొంత డబ్బు చేరితే నా ఆశయం నెరవేరుతుంది. అందుకే సిగరెట్లు మానేశాను. ఆఫీసుకు కాలినడకన వెళ్లి బస్సుఛార్జీలు ఆదా చేశాను. ఆఫీసులో ఓవర్ టైము చేశాను. ఈరోజే ఆ అమ్మాయికి కాలు అమర్చారు. నాకు కృతజ్ఞతలు చెప్పి, నీకూ చెప్పాలనివుందని, నిన్ను తనకు చూపించమంది. ఈ విషయం నీకు ముందే చెప్తే నేను కష్టపడటం ఇష్టంలేక నా ప్రయత్నాన్ని అడ్డుకుంటావని చెప్పలేదు."

ఎంత గొప్పవ్యక్తి ఈయన?! ఆయన ముందు చాలా చిన్నదాన్లా కనిపించాను. అటువంటి సంస్కారిని అనుమానించినందుకు సిగ్గుపడ్డాను.

●

'ఆంధ్రజ్యోతి' వారపత్రిక ... 23 జనవరి' 1998

తమ రచనలను పుస్తకరూపంలోకి తీసుకురావాలన్న ఆసక్తి, అభిలాష
ఉండికూడా ప్రచురణకి అయ్యే ఖర్చుని చూసి వెనుకంజ వేస్తున్న
వర్ధమాన, అనుభవజ్ఞులైన రచయితలకు ప్రచురణ వ్యయంలో వెసులుబాటును కల్పిస్తూ...

జయంతి పబ్లికేషన్స్

రూపొందించిన ప్రచురణ విధానాల గురించిన పూర్తి వివరాల కోసం
రూ॥ 5/- స్టాంపు అంటించిన కవరును జతపరచి మా అడ్రసుకి వ్రాయండి.